
# కథ చేసిన కల్యాణం



## లక్ష్మీ శ్రీనివాసన్

అప్పుడే మార్కెట్‌లో కొచ్చిన ఓ మాసపత్రిక కొనుక్కొని ఇంటివైపు నడక సాగించాడు కృష్ణమూర్తి.

అతను నెలకో అరవై రూపాయల విలువైన వార, మాసపత్రికలు కొని వాటిలో కథలన్నీ చదువుతూంటాడు.

బాగున్న కథలపై పత్రికలకు తన అభిప్రాయాన్ని కూడా రాస్తూంటాడు.

కృష్ణమూర్తి హైద్రాబాద్‌లో ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఒక్కడే కొడుకు కావటంతో వదిలివుండలేక-స్వంత వూళ్ళో వున్న పొలం కౌలుకిచ్చేసి అతనిదగ్గరే ఉంటున్నారు కృష్ణమూర్తి తల్లిదండ్రులు

అన్ని విధాలా యోగ్యుడైన కృష్ణమూర్తికి భారీగా కట్నం ఇస్తామంటూ ఈ మధ్యనే పెళ్ళిసంబంధాలు వస్తున్నాయి. వాటిలో ఏదొక సంబంధం కుదిర్చి కొడుకుని ఒకింటివాణ్ణి చేస్తే తమ బాధ్యత తీరిపోతుందని తలపోస్తున్నారు వాళ్ళు.

అయితే కృష్ణమూర్తికి ఓ రచయిత్రిని పెళ్ళాడాలన్న కోరిక ఎప్పట్నించో వుంది. కట్నం తీసుకోకూడదన్న సదాశయం కూడా వుంది. అందుకేవచ్చిన ఏ సంబంధం అంగీకరించలేదతను. తల్లిదండ్రులు తరచి తరచి అడిగిన మీదట తన మనసులోని మాట బయటపెట్టాడు ఒకరోజు

"నిక్షేపంలాంటి సంబంధాలు కాదని ఇదేం కోరికరా నాయనా!" అంది కొడుకు చెప్పింది వింటూనే ఆశ్చర్యపోతూ అతని తల్లి.

"పుస్తకాలు చదివి చదివి వీడు నిజంగానే పిచ్చిపట్టినట్టుంది..." అంటూ ఇంతెత్తున ఎగిరిపడి కథలు, నవలలు రాస్తున్న ఆడవారిని కాస్సేపు తిట్టి-తర్వాత శాంతంగా కొడుక్కెన్నో విధాల హితబోధచేశాడు తండ్రి.

కృష్ణమూర్తి తల్లిదండ్రుల మాటలు లక్ష్యపెట్టలేదు. తన పట్టుదల విడిచిపెట్టలేదు...ఆ గొడవ జరిగిన రోజు నుంచి అయిదురోజుల పాటు ఇంట్లో అన్నపానీయాలు ముట్టుకోలేదతను.

దాంతో భయపడిపోయి కొడుకు ఇష్టప్రకారమే చెయ్యడానికి ఒప్పుకొన్నారు

వాళ్ళు. పెళ్ళి విషయంలో అతడికి పూర్తి స్వేచ్ఛ నిచ్చారు. అది మొదలు తమ బంధువుల్లో రచయిత్రి అయిన పెళ్ళిగాని పిల్లలెవరయినా వున్నారేమోనని తమ అన్వేషణ మొదలుపెట్టాడు కృష్ణమూర్తి తండ్రి. కానీ ఇంతవరకూ ఆయన అన్వేషణ ఫలించలేదు.

కృష్ణమూర్తి ఇల్లు చేరుకునేసరికి చీకటిపడింది. వంటగదిలో వున్న తల్లి కొడుకును చూస్తూనే టీ తీసుకొచ్చి "నీకేదో వుత్తరం వచ్చిందిరా అబ్బాయ్! డ్రాయర్లో పడేశాను చూడు!!" అని చెప్పి తిరిగి తన పనిమీద వెళ్ళిపోయింది.

కృష్ణమూర్తి బట్టలు మార్చుకుని టీ త్రాగి, డ్రాయర్‌లోంచి ఉత్తరం తీసి 'ఫ్రమ్' అడ్రసు చూస్తూనే వులిక్కిపడ్డాడు క్షణకాలం. ఉత్తరం పట్టుకున్న అతడి చెయ్యి వణికింది...ఆ వెంటనే ఉత్తరం చించి ఆత్రంగా చదవటం మొదలు పెట్టాడు.

"శ్రీయుత కృష్ణమూర్తిగారికి నమస్కారం!

పత్రికవారు మీ ఉత్తరాన్ని నాకు పంపించారు. "ఈ కథలు మారవా" అన్న నా కథపై మీ అభిప్రాయానికి కృతజ్ఞతలు. అయితే మీ అభిప్రాయంతో నేను ఏకీభవించలేకపోతున్నందుకు మన్నించగలరు. ఆ కథలో అమ్మాయి పెళ్ళి ఓ యువకుడితో ఆదర్శంగా జరిగిపోయిందని రాస్తే మీరు హర్షించివుండేవారేమో!...కానీ వాస్తవ జీవితంలో అంతటి ఆదర్శమూర్తులెవరూ కనిపించడంలేదు. ఎన్నో కథలు చదువుతున్నా-సినిమాలు చూస్తున్నా-నాటికలు వింటున్నా నేటి యువకుల్లో వారి తల్లిదండ్రుల్లో మార్పు రావటం లేదు. ఈ వరకట్న సమస్య రానురాను మరింత బలం పుంజుకుంటుంది. అందుకే ఆ కథకు అవాస్తవికమైన ముగింపు ఇవ్వలేక అలా వదిలేసాను. మీరు మీ చుట్టూవున్న సమాజాన్ని నిశితంగా పరిశీలించండి...ఈ నిజం తప్పక బోధపడుతుంది. మీకు నాపైగల అభిమానానికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ.

వసంత."


వైజాగ్

25-3-86

ఓ పక్కన ఆమె పూర్తి అడ్రస్ కూడా వుంది. ఉత్తరం పూర్తికాగానే కృష్ణమూర్తి వింత అనుభూతికి లోనైయ్యాడు. ఏదో తెలియని ఆనందంతో తేలిపోసాగేడు.

కృష్ణమూర్తి అభిమాన రచయిత్రి వసంత. ఈ మధ్యనే ఆమె కథలు తరచూ పత్రికల్లో వస్తున్నాయి. కాలక్షేపంగా కాకుండా ఆమె రాసిన కథలన్నీ ఆలోచింపచేసేవిగా వుండటంతో విడవకుండా ప్రతికథా చదువుతున్నాడతను.

అలాగే మూడువారాల క్రితం ఓ




పత్రికలో వచ్చిన "ఈ కథలు మారవా?" అని ప్రశ్నిస్తూ కథను ముగించిందామె. ఆ ముగింపు కృష్ణమూర్తికి నచ్చలేదు. కథ అసంపూర్తిగా నిలిచిపోయినట్టు అనిపించడమేగాక - మనుషుల్లో మానవత్వం మరీ మృగ్యమయినట్టు రాయటం అతడికెంతో అసంతృప్తిని కలిగించింది. అదే అభిప్రాయాన్ని తెలియచేస్తూ వెంటనే ఆ పత్రికకు ఉత్తరం రాశాడు అతను.

తన ఉత్తరం పత్రికవారు ఆమెకు పంపిస్తారనీ - ఆమె నుండి తనకు సమాధానం వస్తుందనీ అతడెంత మాత్రం ఊహించలేదు... ముత్యాల్లా వున్న ఆ ఉత్తరంలోని అక్షరాలు అతణ్ణి ముగ్ధుణ్ణి చేశాయి. ముగింపుగా వసంత రాసిన మాటలు అతడినెంతో ఆలోచింప చేశాయి.

ఆలోచించగా, ఆలోచించగా వసంత రాసినది చాలామటుకు నిజమే ననిపించింది కృష్ణమూర్తికి. ఎందుకంటే- నిన్నగాక మొన్న జంతికలు అమ్ముకుని జగన్నాధం కూడా అయిదువేలు కట్నం తీసుకుని పెళ్ళిచేసుకున్నాడు. ఇక ఉద్యోగాలు చేసుకునే యువకుల సంగతి వేరే చెప్పాలా!"

కాస్సేపటి తర్వాత వసంతకు-ఆమె వివరాలు తెలుపమని ఉత్తరం రాస్తూ చివరిగా ప్రస్తుతానికి నేను మీతో ఏకీభవిస్తున్నాను. అయితే ఎప్పటికీ ఈ పరిస్థితి ఇలా వుండదు. అవకాశం వస్తే ఈ విషయం నేనే రుజువుచేస్తాను. ముందు ముందు యువకుల్లో తప్పనిసరిగా చైతన్యం వచ్చి తీరుతుంది!" అన్న ఆశాభావాన్ని వ్యక్తంచేస్తూ ముగించి అప్పటికప్పుడు ఆ ఉత్తరం

పోస్టుచేసి వచ్చారు.

ఆనాటి నుంచీ కృష్ణమూర్తి వైఖరిలో మార్పొచ్చింది.

ఏవేవో ఆలోచనలతో రాత్రిళ్ళు నిద్ర కరువైంది. తను ఉత్తరం రాసిన అయిదో రోజు నుండి ఆమె జవాబుకోసం ఆత్రంగా ఎదురుచూడ నారంభించాడు. అయితే ప్రతిరోజూ అతడికి నిరాశ మాత్రమే మిగిలేది.

పది హేనురోజుల తర్వాత కృష్ణమూర్తి నిరాశను పటాపంచలు చేస్తూ వసంత దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. అతడికి ఏనుగెక్కినంత సంబరమైంది. ఒక విధమైన ఉద్వేగంతో ఉత్తరం చదివేడు. ఆ ఉత్తరంలో వున్న వివరాలను బట్టి వసంతకు పెళ్ళి కాలేదని తెలిసిందతనికి. అది తెలియగానే తన కోరిక ఫలించే రోజు అతి సమీపంలో వుందనిపించింది. ఇక ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా తన పూర్తి వివరాలతో పాటు తనకో రచయిత్రిని పెళ్ళి చేసుకోవాలన్న కోరిక వుందనీ, వీలు చూసుకొని వైజాగ్ వస్తాననీ ఉత్తరం రాశాడు కృష్ణమూర్తి.

అతని కోరిక ఫలించాలని ఆశిస్తూ తిరిగి జవాబు రాసింది వసంత.

ఇలా వారిద్దరి మధ్య ఉత్తరాలు నడుస్తున్నాయి.

ఇంతలో అనుకోకుండా ఫ్యాక్టరీ పని మీద వైజాగ్ వెళ్ళాల్సిన అవసరం ఏర్పడింది కృష్ణమూర్తికి. ఆ వార్త తెలియగానే తన అభిమాన రచయిత్రి వసంతను తప్పక కలుసుకురావాలని నిశ్చయించుకున్నాడు.

ఆ మరుసటిరోజే గోదావరిలో వైజాగ్ బయల్దేరాడు కృష్ణమూర్తి. రైలు స్టేషన్ విడిచిపెట్టింది మొదలు వైజాగ్ ఎప్పుడు చేరుతుందా అన్న ఆరాటం అతడిలో క్షణం క్షణం అధికం కాసాగింది...


* * *

గోదావరి ఎక్స్‌ప్రెస్ వైజాగ్ చేరే సరికి ఉదయం తొమ్మిదిన్నరయింది. కృష్ణమూర్తి రైలు దిగి ఆటోలో జగదాంబ సెంటర్ కొచ్చాడు.

అక్కడో లాడ్జిలో రూమ్ బుక్‌చేసుకొని, టిఫిన్, కాఫీ వగైరాలు కానిచ్చి ముందుగా ఫ్యాక్టరీ పనిమీద బయల్దేరాడు.

ఆ పని ముగిసేసరికి ఒంటిగంటయింది. దార్లో ఓ హోటల్లో భోజనం చేసి లాడ్జికొచ్చి పడుకున్నాడు...అతను నిద్రలేచేసరికి సాయంత్రం నాలుగున్నర అయిపోయింది. గబగబా స్నానం చేసి, నీట్‌గా డ్రస్ చేసుకొని అడ్రసు ప్రకారం వసంత ఇంటికెళ్ళాడు.

అది చిన్న పెంకుటిల్లు. అది కూడా దాదాపు శిథిలావస్థలో వుంది. ఆ ఇంటిని చూస్తూనే ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి. తన అభిమాన రచయిత్రి వసంత వుంటున్నది ఈ ఇంట్లోనా—




తను పొరబడలేదు కదా అన్న అనుమానం వచ్చి చెక్క-గేటున్న ఇంటి వెంబడువైపు మరోసారి పరీక్షగా చూశాడు.

నిస్సందేహంగా అది వసంత ఇల్లే. కొన్నిక్షణాలపాటు అలాగే నిలబడిపోయి చివరికి గేటు తెరుచుకొని లోపలికెళ్ళి మూసివున్న తలుపుతట్టాడు.

వెంటనే లోపల్నుంచి "ఎవరది?" అన్న కోమలస్వరం వినబడింది. కృష్ణమూర్తి బదులు చెప్పేటంతలో తలుపు తెరుచుకొంది- ఎదురుగా ఇరవై అయిదు వసంతాలు మించని యువతి నిలబడి వుంది.

కంఠస్వరాన్ని బట్టి ఆమె ఎంతో అందంగా వుంటుందనుకున్న కృష్ణమూర్తి ఊహ తారుమారైంది- ఆమె ఛామనచాయ రంగులో వుంది. మొహం మాత్రం బాగా కళగా వుంది. ఇంతకీ ఈమె వసంతేనా?... సందిగ్ధంలో వుండిపోయాడు కృష్ణమూర్తి.

"ఎవరు కావాలండీ మీకు?" అందామె ఒకటి, రెండు క్షణాల తర్వాత.

"వసంతగారున్నారండీ!" తటపటాయిస్తూ అడిగాడు కృష్ణమూర్తి.

"నేనే వసంతను! మీరు... మీరు

కృష్ణమూర్తిగారా?"

క్షణకాలం అవాక్కయ్యారు కృష్ణమూర్తి. అంత కరెక్టుగా తనే అని ఆమె ఎలా ఊహించగలిగింది? ఈ రచనలు చేసేవాళ్ళకేమైనా దివ్యదృష్టి వుంటుందా? అదే మాట ఆమె నడిగారు.

వసంత నవ్వి, "అందరి సంగతి నాకు తెలియదు కాని నాకు మాత్రం అలాంటి దివ్యదృష్టి లేదు. ఇంతకు ముందు ఉత్తరాల్లో విశాఖపట్నం వస్తాననీ; నన్ను కలుస్తాననీ మీరు వ్రాశారు కదా... ఆ దృష్టితో ఆలోచించి మీరే కృష్ణమూర్తి అయి వుంటారనుకున్నాను. రండి... లోపలికొచ్చి కూర్చోండి!" అంది ఆప్యాయంగా.

కృష్ణమూర్తి లోపలికడుగుపెట్టి అక్కడున్న చెక్కకుర్చీలో కూర్చున్నారు.

ఆమె లోపలికెళ్ళి రెండు నిమిషాల్లో నిమ్మరసం తీసుకొచ్చి కృష్ణమూర్తికిచ్చింది. నిమ్మరసం త్రాగి, వసంత కథలన్నిటినీ గుర్తుచేసుకొని ఆమెను అభినందనలతో ముంచెత్తారు కృష్ణమూర్తి.

అతడికి 'థాంక్స్' చెప్పింది వసంత.

అయిదునిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయ్.

"మీరొక్కరే కనిపిస్తున్నారు ఇంట్లో ఎవరూ లేరా?" అన్నాడామె మౌనంగా వుండిపోవటంతో కృష్ణమూర్తి.

"నాన్న బజారుకెళ్ళారు. అక్కయ్యలిద్దరూ పెళ్ళిళ్ళు చేసుకొని ఎవరి సంసారాలు వాళ్ళు దిద్దుకుంటున్నారు. దురదృష్టవశాత్తుగా నా చిన్నప్పుడే మా అమ్మగారు చనిపోయారు. ఇప్పుడు నాన్నే తల్లీ తండ్రీను నాకు. కూర్చోండి పది నిమిషాల్లో ఆయన వచ్చేస్తారు. కలుసుకొని వెళ్దురుగాని-" అంటున్న వసంత మాటలు పూర్తికాకుండానే కూరలసంచీ చేత్తోపట్టుకొని ఆమె తండ్రి లోపలికొచ్చారు.

సుమారు అరవై సంవత్సరాల వయస్సుంటుందతడికి. జీవితంలో ఎన్నో కష్టసుఖాలు కాచివడపోసిన మనిషిలా వున్నాడు. గంభీరంగావున్న అతడి మొహంలో ఒక విధమైన తేజస్సు వుట్టిపడుతోంది.

ప్రశ్నార్థకంగా చూస్తున్న తండ్రికి కృష్ణమూర్తిని పరిచయం చేసింది వసంత. కృష్ణమూర్తి అతడికి నమస్కరించారు. ఆయన కూడా నమస్కరించి, "మీకు సాహిత్యం మీదున్న అభిమానానికి, ఆసక్తికీ సంతోషిస్తున్నాను బాబూ! నువ్వు వ్రాసే ప్రతి ఉత్తరం నేను కూడా చూస్తుంటాను గనక ఇక నీ గురించి తెలుసుకోవాల్సింది లేదనుకుంటాను!" అన్నారు నవ్వుతూ.

కొత్త బిడియవల్ల కృష్ణమూర్తి క్షణమాగి "మీరేదైనా ఉద్యోగం చేస్తున్నారా?" అన్నాడు.

"ఓ ప్రైవేట్ ఫరమ్‌లో గుమాస్తాగా పనిచేసి రెండేళ్ళక్రితం రిటైరయ్యాను

బాబూ!...ఇప్పుడు నిరుద్యోగినే-ఇదిగో వసంత పెళ్ళికూడా చేసేస్తే ఏకాకిని కూడా!" అన్నాడాయన మళ్ళీ నవ్వి.

"నేను వంట సంగతి చూస్తాను నాన్నా! మీరు మాట్లాడుతూండండి!" అని వసంత లోపలికెళ్ళిపోయింది.

"అయితే వసంతగారి పెళ్ళి నిశ్చయమైపోయిందాండీ!" అన్నాడాత్రంగా కృష్ణమూర్తి.

"డబ్బు కావాలేగాని లోకంలో పెళ్ళి కొడుకులకు కొదవేముంది బాబూ!... ఆ డబ్బు లేకనే ఇంతవరకూ అమ్మాయి పెళ్ళి చెయ్యలేకపోయాను. పోనీ ఈ ఇల్లు ఎంతకో అంతకు అమ్మిపారేసి పెళ్ళిచేస్తానంటే అమ్మాయి ససేమిరా ఒప్పుకోదు!!" ఆయన మాటల్లో ఆవేదన తొంగిచూసింది.

"ఎందుకని?" అడిగాడు కృష్ణమూర్తి.

"ఎందుకంటే ఏం చెప్పను బాబూ! తన గురించి నిలువనీడ లేకుండా చేసుకోవడం అమ్మాయికెంత మాత్రం ఇష్టంలేదు. మరో విధంగా డబ్బు సమకూర్చి పెళ్ళిచెయ్యడానికి ఈ ఇల్లు తప్ప నా దగ్గరేంలేదు. ఏం జరగనుందో-నా బెంగంతా దాని గురించే బాబూ!!" బాధగా అన్నాడాయన.

అతడి మాటలువిని ఏదో ఆలోచనలో పడ్డ కృష్ణమూర్తి ఒకటి రెండు నిమిషాల తర్వాత "నేను వసంతను పెళ్ళిచేసుకోడానికి మీ కేమైనా అభ్యంతరమా!" అన్నాడు చటుక్కున.

ఆశ్చర్యంగా కృష్ణమూర్తి మొహం లోకి చూశాడు వసంత తండ్రి.

"నిజంగానే అంటున్నానండీ! ఇది మీమీది సానుభూతితో అంటున్నమాట కాదు. ఓ రచయిత్రిని పెళ్ళి చేసుకోవాలన్నది నా చిరకాల వాంఛ. అందుకోసమే నేనింతవరకూ పెళ్ళిచేసుకోలేదు. ఓ మంచి రచయిత్రిఅయిన వసంతను పెళ్ళి చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మీరిప్పుడే వసంత అభిప్రాయం తెలుసుకోండి... నా తల్లిదండ్రులు నా మాట కాదనరు!" అన్నాడు దృఢ స్వరంతో కృష్ణమూర్తి.

అవే మాటలు కృష్ణమూర్తి మరోసారి చెప్పడంతో ఆయన లోపలికెళ్ళి- కాస్సేపటికి తిరిగివచ్చి, "బాబూ, అమ్మాయి తన అంగీకారాన్ని తెలియజేసింది. దేవుడే నాయందు దయతలచి నిన్ను ఇక్కడకు పంపాడేమో!... ఈ రోజు నిజంగా ఎంతో సుదినం!!" అన్నాడు ఆనందాతిరేకంతో.

"అయితే అమ్మానాన్నలతో మాట్లాడానికి మంచిరోజు చూసుకొని హైద్రాబాద్ రండి!... ఇక వసంత పెళ్ళి విషయంలో మీరు నిశ్చింతగా వుండొచ్చు!!" అని- ఆ పూట అక్కడే భోజనంచేసి, మనసు ఆనందసాగరంలో తేలియాడుతూండగా రైల్వే స్టేషను కొచ్చాడు కృష్ణమూర్తి.

* * *

సరిగ్గా నెల్లాళ్ళతర్వాత ఓ శుభ ముహూర్తాన తల్లితండ్రులు- తదితర బంధుమిత్రుల సమక్షంలో వసంతతో- కృష్ణమూర్తి పెళ్ళి జరిగిపోయింది.

అనుకున్నట్టుగా రచయిత్రిని భార్యగా పొందగలిగినందుకూ; అదీ కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నందుకూ మిత్రులంతా కృష్ణమూర్తి నెంతగానో అభినందించారు.

మొదటిరాత్రి—

అంతా సద్దుమణిగాక వసంతను దగ్గరకు తీసుకొని, "రాబోయే నీ కొత్త కథలేమున్నాయి వసూ?" అన్నాడు అనురాగంతో ఆమెను చూస్తూ కృష్ణమూర్తి.

సిగ్గుపడుతున్నట్టుగా తలదించుకుంది వసంత.

"అరె, అద్భుతమైన కథలు వ్రాసిన నువ్వు...మనుషుల స్వభావాన్ని కళ్ళకు కట్టినట్టు కాగితంమీద పెట్టగలిగిన నువ్వు సిగ్గుపడుతున్నావా?" అని ఒక్క క్షణమాగి, "ఔనూ- నీ కథనే 'ఈ కథలు మారవా?' అన్న పేరుతో నువ్వు వ్రాశావని నా కనిపిస్తోంది. నా వూహ నిజమేనా వసూ?" అన్నాడు కృష్ణమూర్తి.

"నిజమేనండీ. అది నా కథే! నా కథను మీరు మార్చినందుకు జీవితాంతం మీకు ఋణపడి వుంటాను...కానీ, ఆ కథ రాసింది నేను కాదు..."

"నువ్వు కాదా!" ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి.

"ఔనండీ, నేను కథలు రాయలేను! నా పేరుతో మా నాన్నగారు రాస్తుంటారు!"

"వసంతా!?" విభ్రాంతితో ఆమెను చూశాడు కృష్ణమూర్తి.

"నేను చెప్పేది నిజమేనండీ! మీరు ఉత్తరాల్లో ఓ రచయిత్రిని పెళ్ళిచేసుకోవాలనే కోరిక వుందనీ, పైగా వచ్చి నన్ను కలుసుకుంటాననీ రాశారుగా- అది చూడగానే నాన్నా, నేనూ ఆలోచించి కావాలనే అసలు విషయం చెప్పలేదు మీకు. నా పెళ్ళికోసం మిమ్మల్ని ఒక విధంగా మోసం చేశాం!... మమ్మల్ని క్షమించరూ!..." అంటూ వసంత కృష్ణమూర్తి కాళ్ళకు చుట్టుకుపోయింది. ఆమె వెచ్చని కన్నీరు కృష్ణమూర్తి పాదాలను తడుపుతూ అతడిలో ఆలోచనలను రేకెత్తించింది...

కాస్సేపటి తర్వాత వసంతను లేవనెత్తి తన హృదయానికి హత్తుకున్నాడు కృష్ణమూర్తి... ఇప్పుడు పెళ్ళి విషయంలో తను మోసపోయానని గానీ రచయిత్రిని పెళ్ళిచేసుకోలేకపోయానని కానీ బాధ లేదతనికి.

వయసొచ్చినా వసంతం తొంగి చూడని వసంత జీవితంలో కాసైనా వసంతాన్ని నింపినందుకూ- రాసింది ఎవరైనా ఓ కథ తమ కల్యాణం జరగడానికి కారణభూతమైనందుకూ అతడికెంతో తృప్తిగా, ఆనందంగా గర్వంగా వుంది

* * *